క్లుప్తంగా

కంచిపల్లికి మాజీ ఎంపీ అనురాధ పరామర్శ



అబ్బులును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధ పడుతున్న అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కంచిపల్లి అబ్బులును మాజీ ఎంపీ చింతా అనురాధ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు తదితర నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు. మంగళవారం స్థానిక కురసాలవారి వీధిలోని అబ్బులు ఇంటికి మాజీ ఎంపీ అనురాధ వెళ్లి పరామర్శించారు. అబ్బులు తల్లి చిట్టెమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బులు సోదరులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు.

పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



గొల్లవిల్లిలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి బాగోగులను తెలుసుకున్నారు. విద్యార్థుల భోజన తయారీ, వడ్డించే విషయంలో సిబ్బంది శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం లంకా రాణి, సీఆర్పీలు పి.మురళీకృష్ణ, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టిన బెంచీలు మార్చాలి

యానాం: స్థానిక రాజీవ్ రివర్ బీచ్‌లో తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిన బెంచీలను మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం రాత్రి సామాజిక కార్యకర్త ఆదిమూలం శ్రీనివాస్ కూర్చున్న బెంచ్ విరిగిపోవడంతో ఆయన కాలుకు తీవ్ర గాయమైందన్నారు. ఇప్పటికైనా పర్యాటక శాఖ, పీడబ్ల్యూడీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితుడికి మంత్రి పరామర్శ

అమలాపురం టౌన్: ఇటీవల ఈదరపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుదాఘాతానికి గురై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడాల ఉమామహేశ్వరరావును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరామర్శించారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తి

ఉప్పలగుప్తం: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ 99 శాతం పూర్తయిందని ఎంపీడీఓ కొఠారి వెంకటేశ్వర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా పంచాయతీ, సచివాలయ సిబ్బందితో అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందించామన్నారు. మండల వ్యాప్తంగా 8,004 మంది లబ్ధిదారులకు గాను 7,943 మందికి పింఛన్ పంపిణీ చేశామన్నారు.

మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులతో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు ఇంట్లో ఈ సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, ఆర్వో శిరిగినీడి శివాజీతో పాటు పట్టణ ప్రణాళిక, పారిశుధ్య అధికారులతో ఎమ్మెల్యే విభాగాల వారీగా చర్చించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల గురించి ఎమ్మెల్యే చర్చించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు రూ.75 వేల సాయం

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరం గ్రామ శివారు మూలగూడెంకు చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల ఐదు నెలల చిన్నారి అఖిల్‌కు లివర్ మార్పిడి శస్త్ర చికిత్స అవసరమైంది. ఈ శస్త్ర చికిత్సకు రూ.25 లక్షల వరకూ వ్యయం అవుతుందని కార్పొరేట్ వైద్యులు తెలిపారన్నారు. డ్రైవర్‌గా జీవనం సాగించే తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ తమ సభ్యుల సహకారంతో రూ.75 వేలు నగదును మంగళవారం అఖిల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

చేపా.. చేపా.. తినలేవు రొయ్యల మేత

- చేప, రొయ్యల మిశ్రమ సాగులో నూతన ఒరవడి
- ఒకే చెరువులో వేర్వేరుగా మేత అందేలా ఏర్పాట్లు
- అధిక దిగుబడులకు ఇదే మార్గమంటున్న ఆక్వా రైతులు



ఎన్.కొత్తపల్లిలో రొయ్యలకు వేరుగా ఆహారాన్ని అందించడానికి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ మెష్‌లు

ఉప్పలగుప్తం: వర్షాకాలం, శీతాకాలాల్లో రొయ్యల సాగులో నష్టాలను చవిచూస్తున్న ఆక్వా రైతులు చేపలు, రొయ్యల మిశ్రమ సాగును ఎంచుకుని లాభాల బాటలో నడుస్తున్నారు. అయితే మిశ్రమ సాగులో ఖరీదైన రొయ్యల మేతను చేపలు తినేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపి నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ఒకే చెరువులో రెండింటికీ వేరువేరుగా మేత అందించేలా ప్రత్యేక ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. దీనివల్ల వేటి కోసం వేస్తున్న మేత వాటికే అంది మంచి దిగుబడులు లభిస్తాయని ఆక్వా రైతులు చెబుతున్నారు.

సాగు చేసే విధానం ఇలా..

చెరువులో కొంత భాగాన్ని పెద్ద కన్నుల ప్లాస్టిక్ మెష్‌తో వేరు చేయాలి. అందులో రొయ్యలకు అవి తీసుకునే ఆహార సమయానికి అధిక ప్రొటీన్ కలిగిన ఆహారాన్ని, మిగతా భాగంలో చేపలకు ఆహారం వేయాలి. మెష్ లోపల భాగంలోకి చిన్న రంధ్రాల నుంచి రొయ్యలు మాత్రమే ప్రవేశించి మేతను తింటాయి. తరువాత చెరువంతా తిరుగుతాయి. చెరువులో ఏర్పడిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు చేపలు తినడం వల్ల వ్యాధులు సోకే అవకాశం తక్కువగా ఉంటుంది. రొయ్యల చెరువుల్లో వచ్చే కొన్ని వ్యాధులను మిశ్రమ సాగులో అధిగమించవచ్చని ఆక్వా రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు

మిశ్రమ ఆక్వా సాగులో బొచ్చె, శీలావతి, రూప్‌చంద్ వంటి తెల్ల చేపలతో పాటు వనామీ రొయ్యలను కలిపి పెంచుతున్నారు. 200 గ్రాముల బరువున్న చేప పిల్లలను ఎకరాకు 1500 నుంచి 2000 వరకూ చెరువులో వదులుకోవాలి. వాటికి నూనె తీసిన తవుడు(డీవోబీ) రోజూ మేతగా అందించాలి. 20 రోజుల తర్వాత తక్కువ ఉప్పు శాతం కలిగిన 20 రోజుల వయసున్న వనామీ పిల్లలు 60,000 వదులుకోవాలి. 50 నుంచి 60 రోజుల్లో 50 కౌంట్(కేజీకి 50) చేరతాయి. వాటిని విసురు వలల సాయంతో పట్టుబడి చేసుకోవాలి. 7 నుంచి 9 నెలల కాలంలో మూడు దఫాలుగా పట్టుబడి చేయవచ్చు. పంట చివరి దశలో చేపలు పట్టాలి. ఎకరా చెరువుకు చేపల నుంచి రూ.లక్ష వరకూ, రొయ్యల ద్వారా రూ.5 లక్షల వరకూ లాభాలను ఆర్జించొచ్చని పలువురు ఆక్వా రైతులు చెబుతున్నారు. మిశ్రమ సాగులో దిగుబడుతు ఆశాజనకంగా కనిపించడంతో కొత్తగా పలువురు రైతులు ఈ విధానంపై ఆసక్తి

చెరువులో మెష్ ఏర్పాటుతో రొయ్యలకు విడిగా ఆహారం



ప్రత్యేకంగా రొయ్యల సాగులో రొయ్యలు మాత్రమే ఉండటంతో నాణ్యత గల ఆహారాన్ని వాటికి అందిస్తుంటాం. కాని మిశ్రమ సాగుకు వచ్చేసరికి రొయ్యలకు అందించే ఆహారం చేపలు తినేస్తుంటాయి. ఈ కారణంగానే తక్కువ నాణ్యత ఉన్న మేతను రొయ్యలకు వేస్తుంటారు. దీనివల్ల రొయ్య ఎదుగుదల సైతం చిన్నగానే ఉంటుంది. అందుకే మిశ్రమ సాగులో చెరువులో కొంత భాగం మెష్‌తో వేరు చేసి రొయ్యలకు ప్రత్యేకంగా నాణ్యత కలిగిన ఆహారం అందించి, బయట వైపున చేపకు సంబంధించిన ఆహారం వేరుగా అందిస్తున్నాం. దీనివల్ల రెండింటికి సరైన పోషకాలు అందుతున్నాయి. సమయానుకూలంగా దిగుబడి తీయగలుగుతున్నాం.

– నల్లా రమేష్, ఆక్వా రైతు, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం



ప్రత్యేక అలంకరణలో కనక మహాలక్ష్మి అమ్మవారు

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో కొలువైయున్న గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవాలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాడమాసం ముందు వచ్చే మంగళవారం రోజున అమ్మవారి వార్షికోత్సవాన్ని నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకోవడం అనవాయితీగా వస్తోంది. వార్షికోత్సవం సందర్భంగా దేవగుప్తం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి ఆలయం వద్ద గరగ నృత్యాలతో జాతర నిర్వహించారు.

నేటి నుంచి వారాహి నవరాత్ర మహోత్సవాలు



వారాహి మహోత్సవాలకు దాతలు సమకూర్చిన సామగ్రితో అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆదిశేష నిలయంలో ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి 16వ తేదీ వరకూ వారాహి నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. పూజా మహోత్సవాల నిర్వహణకు అవసరమైన రాగి కలశాలు, కొబ్బరి కురిడీలు, నువ్వుల నూనెను పలువురు దాతలు సమకూర్చారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన గుబ్బల సత్యనారాయణ కుటుంబీకులు రూ.45 వేల విలువైన 33 రాగి కలశాలను అందించారు. మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన వేగి రామకోటేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు రూ.25 వేల విలువైన కొబ్బరి కురిడీలను సమకూర్చారు. పట్టణంలోని కొంకాపల్లికి చెందిన చిక్కాల నాగ సుబ్రహ్మణ్యం రూ.12 వేల విలువైన నువ్వుల నూనె, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పెరుమాళ్ల శ్రీనివాస్ మరో రూ.12 వేల విలువైన నువ్వుల నూనెను అందించారు. అమలాపురానికి చెందిన సలాది సాయిరామ్ రూ.10 వేలు, అంబాజీపేటకు చెందిన అరిగెల నాగేశ్వరరావు(బుజ్జి) రూ.10 వేల వంతున నగదు సమకూర్చారు. దాతలు స్థానిక ఆదిశేష నిలయంలో అక్షయ పాత్ర ప్రతినిధులకు వితరణ చేసిన వస్తువులు, నగదును మంగళవారం అందించారు. అక్షయ పాత్ర సంస్థ వ్యవస్థాపకురాలు పోతుల నాగ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో మొక్కలు నాటారు



పార్కులో మొక్కలు నాటుతున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పౌరులందరూ తమ తల్లి పేరుతో ఒక పచ్చని మొక్క నాటాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపుతో ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని చంద్రశేఖర్ ఆజాద్ పార్కులో మంగళవారం సాయంత్రం మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణలో పాలు పంచుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమిల్లి నాగ సుధా కొండ సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అడ్డాల గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర

అమలాపురం రూరల్: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాల్సిన వైద్యారోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర హెచ్చరించారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావు దొర మాట్లాడుతూ డయేరియా వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకొచ్చిన స్టాఫ్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ సత్యం, ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ కామేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీజెన్సీ పరిశ్రమ ప్రారంభానికి సహకరించాలి



ఎల్జీ రాధాకృష్ణన్‌ను కలిసిన రీజెన్సీ సంస్థల చైర్మన్ జీఎన్ నాయుడు

యానాం: యానాంలో రీజెన్సీ టైల్స్ పరిశ్రమ పునః ప్రారంభించేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలకు ప్రభుత్వపరంగా పూర్తి సహకారాన్ని అందించాలని లెఫ్టినెంట్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో రీజెన్సీ పరిశ్రమ వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిందని, అయితే కొన్ని కారణాల వల్ల పరిశ్రమ మూతపడటంతో నష్టాలతో పాటు కార్మికులు సైతం ఉపాధి కోల్పోయారని వివరించారు. తాము పరిశ్రమను తిరిగి తెరిచేందుకు చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివ్వాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎంపిక

అమలాపురం టౌన్: పట్టణ సూర్య బలిజ సంఘానికి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం గౌరవాధ్యక్షుడు మద్దుల రవి నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంఘం నూతన అధ్యక్షుడిగా భాస్కర్ల రామకృష్ణను మాత్రమే ఎన్నుకున్నామన్నారు. మంగళవారం స్థానిక సూర్యబలిజ నగర్‌లో సంఘం సభ్యులంతా సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా కాశే సురేష్, కార్యదర్శిగా యండమూరి శివ కేశవ, సంయుక్త కార్యదర్శిగా పందిరి శ్రీనివాస్, కోశాధికారిగా దరణికోట శ్రీనివాస్, ప్రజా సంబంధాల సభ్యుడిగా కాశే వెంకటేశ్వరరావు, మరో పది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘ గౌరవాధ్యక్షుడు రవి నాగేశ్వరరావు, అధ్యక్షుడు రామకృష్ణ అభినందించారన్నారు.

అనుమతుల్లేని వాటర్ ప్లాంట్ సీజ్



తాళ్లరేవు సత్యశ్రీ వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు బైపాస్ రహదారిలో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న సత్యశ్రీ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు తదితరులు స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులతో కలిసి వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సత్యశ్రీ వాటర్ ప్లాంట్‌కు బీఐఎస్ సర్టిఫికెట్ లేకుండా వాటర్ ప్యాకెట్‌లు, బాటిళ్లు తయారు చేస్తున్నట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. బీఐఎస్ సర్టిఫికెట్, ఫుడ్ లైసెన్స్, పంచాయతీ అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు శాంపిల్స్ తీసుకుని, సరుకును సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. రిపోర్టులు వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మూడు జిల్లాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా, ముఖ్యంగా బీఐఎస్ సర్టిఫికెట్ లేకుండా వాటర్ ప్యాకెట్‌లు, బాటిళ్లు తయారు చేస్తునట్లయితే ఫిర్యాదు చేయాలని వారిపై కఠిన చర్యలు చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు. వారి వెంట తాళ్లరేవు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయితేజ, పంచాయతీ కార్యదర్శి సున్న శంకర నారాయణ, వీఆర్వో సమనస వీరబాబు తదితరులు ఉన్నారు.

హోంగార్డు పోస్టులకు 26 మంది ఎంపిక

యానాం: పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీన నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ అధికారి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పంకజ్‌కుమార్‌ఝా సోమవారం అర్ధరాత్రి విడుదల చేశారు. యానాం రీజియన్ నుంచి 332 మంది పరీక్షకు హాజరుకాగా 25 మంది పురుష అభ్యర్థులు, ఒక మహిళా అభ్యర్థి హోంగార్డు పోస్టులకు ఎంపికయ్యారు. 82.25 శాతం మార్కులతో అరదాడి కాయరాజు ప్రథమ స్థానం సాధించగా, పెమ్మాడి గంగాధర్ 80.50 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. కోల ఆనందవర్మ, చందు, మోహన్‌ప్రకాష్, రామ దుర్గారావు, భైరవగాంధీ, మణికంఠస్వామి, గాలిరాజు, గణపతిశ్రీరామ్, లక్ష్మీనరసింహమూర్తి, మల్లాడి సతీష్, కస్తూరి పోషియ్య, దుర్గాప్రసాద్, సంతోష్‌కుమార్, శశిధర్మ ప్రకాష్, విజయకుమార్, శ్యామ్‌బాబు, శివశంకర్‌వర్మ, పోలిశెట్టి వీరవేణి తదితరులు ఎంపికయ్యారు.

హోంగార్డు పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా కొత్తగా నేటివిటీ, రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకోవాలని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కమ్ కమాండెంట్(హోంగార్డు) అనితారాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ మెడికల్ టెస్టులు నిర్వహిస్తారన్నారు.

వకుళమాత అన్నదాన భవనానికి రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పసలపూడికి చెందిన కర్రి కృష్ణారెడ్డి–సూర్యకుమారి దంపతులు రూ.50 వేల విరాళం అందినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదాన భవనానికి విరాళం

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆకుల సురేష్, లీలా భవాని దంపతులు రూ.15,620 విరాళం అందినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

రూ.6.48 కోట్లతో ఉపాధి హామీ పనులు



సామాజిక తనిఖీ సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

తాళ్లరేవు: గతేడాది తాళ్లరేవు మండలంలో రూ.6.48 కోట్ల ఉపాధి పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమావేశం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏపీఓ టి.తేజస్వి మాట్లాడుతూ మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో 1769 పనులకు గానూ రూ.6.40 కోట్ల మేర వేతనాలు చెల్లించగా, మరో రూ.7 లక్షల సామగ్రి సమకూర్చామన్నారు. ప్రతి గ్రామంలోనూ కూలీలకు పనులు కల్పిస్తున్నామన్నారు. అనంతరం మండలంలోని 17 పంచాయతీల వారీగా జరిగిన పనులపై సమీక్షించారు. పలు పంచాయతీల్లో జరిగిన పనుల్లో లోపాలను గుర్తించి జరిమానాలు విధించారు. మండలంలో ఉపాధి కూలీల సమస్యలను తీర్చాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకుడు ఈశ్వరరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఏపీడీ వసంత మాధవి, అంబుడ్స్‌మెన్ జ్యోతి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న కార్యదర్శులు, ఉద్యోగులు

అమలాపురం రూరల్: ఎంపీడీఓగా జొన్నాడ వెంకటేశ్వరరావు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. అమలాపురం ఎంపీడీఓగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన జొన్నాడ వెంకటేశ్వరరావును మండలంలోని ఇందుపల్లి ఏ వన్ కన్వెన్షన్ హాలులో మంగళవారం రాత్రి సత్కరించారు. అభినందన సభలో డీఎల్‌పీఓ బొజ్జిరాజు, డ్వామా పీడీ ఒ.మధుసూదన్‌రావులు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు పంచాయతీరాజ్ శాఖలో 43 ఏళ్ల పాటు అంకిత భావంతో పనిచేశారంటూ కొనియాడారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను ఎంపీపీలు, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, పంచాయతీరాజ్ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఎస్ సూరపరాజు, కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలు రెడ్డి శిరీష, కార్యదర్శులు ఆదినారాయణ, ధనలక్ష్మి తదితరులు సత్కరించారు.

వైభవంగా రావులమ్మ జాతర

అంబాజీపేట: వాకలగరువులో వేంచేసిన రావులమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అలాగే జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అమ్మవారి తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆడిట్ అభ్యంతరాలతో రూ.20 వేల రికవరీ



మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో 2023–2024 సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ అభ్యంతరాలు తెలియజేయండంతో క్షేత్ర సాయి సిబ్బంది నుంచి రూ.20 వేలు నగదు రికవరీ చేసినట్లు డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మంగళవారం 2023–24కి సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలను ఎస్‌ఆర్‌పీ కనకరావు, డీఆర్పీలు చదివి వినిపించారు. అయితే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి కూలీలకు వేతనం ద్వారా రూ.8.47 కోట్లు చెల్లించామన్నారు. అలాగే మెటీరియల్ నిమిత్తం రూ.2.09 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే గ్రామాల్లో మొక్కలు నాటినట్లు చూపించారన్నారు. అక్కడ మొక్కలు నాటిన ఆనవాళ్లు లేవని, అలాగే పంట బోదెలు తవ్విన ఆనవాళ్లు లేవన్నారు. వీటికి మాత్రం వేతనాలు చెల్లించినట్లు రికార్డు చేసినట్లు తెలిపారు. మస్తర్లల్లో సంతకాలు, వేలిముద్రలు లేకపోవడం, కూడికల్లో తేడాలు, రుద్దివేతలు ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. రైతులు కొబ్బరి తోటల్లో అంతరపంటల సాగుకు, వాటి మెయింటెనెన్స్‌కు ఉపాధి హామీలో నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, అంబుడ్స్‌పర్సన్ ఎ.శ్రీనివాసరావు, ఏపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు మరమ్మతులకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: కువైట్ కేంద్రంగా ఉన్న సామాజిక సేవా సంఘం ఆదర్శ ఆంధ్రాయూత్, సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన గొల్ల బాలసుందర్రావుకు రూ.15 వేలు ఆర్థిక సాయం మంగళవారం పంపిణీ చేశారు. పేద కుటుంబానికి చెందిన బాల సుందర్రావు మంచానికే పరిమితమయ్యాడు. ఇంటి పై కప్పు దెబ్బతిని వర్షాలకు ఆ కుటుంబం అవస్థలు పడుతోంది. దీంతో ఈ విషయాన్ని స్థానికుడు నల్లి మాధవరావు ఆదర్శ ఆంధ్రా యూత్(కువైట్)కార్యవర్గ మెంబర్ నల్లి ఏసురత్నంకు తెలిపారు. ఈ మేరకు సేవా సంఘం నుంచి పై కప్పు వేసుకునేందుకు రూ.15 వేలు సాయం చేశారు. గ్రామ పెద్దలు ఆ కుటుంబానికి అందజేశారు. తాడి సహదేవ్, నల్లి ప్రేమానందం, నల్లి బాలరాజు, గొల్ల మధు, కాత్రు రవికుమార్, గొల్ల ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఆసక్తికరంగా రాజకీయ పరిణామాలు

యానాం: పుదుచ్చేరి ఏకై క లోక్‌సభ స్థానంలో ఎన్డీయే కూటమి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి ఓటమి పాలవడంతో గత కొద్దిరోజులుగా కూటమికి మద్దతిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలంతా అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే బీజేపీ ఎమ్మెల్యేలు ఎల్జీ రాధాకృష్ణన్‌ను కలిసి తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కానరాకపోవడంపై ఫిర్యాదు చేయడంతో పుదుచ్చేరి రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, శివశంకర్ సైతం మంగళవారం న్యూఢిల్లీ వెళ్లారు. అక్కడ బీజేపీ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్‌షాలను కలవనున్నారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో కూటమి మధ్య ఒప్పందం మేరకు బీజేపీ పార్టీకి మంత్రులను రొటేషన్ పద్ధతిలో మార్చకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ పదవులను ఇవ్వకపోవడం తదితర అంశాలను వివరించనున్నట్లుగా తెలుస్తుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడు సెల్వ గణపతిని సీఎం రంగసామి మంగళవారం కలిసి చర్చించినట్లుగా సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



కె.పెదపూడిలో బడి బయట విద్యార్థి తల్లికి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ప్రకాష్

అంబాజీపేట: అన్ని వసతులు కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో బడి బయట ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు చేర్పించాలని ఎంఈఓ–2 మోకా ప్రకాష్ అన్నారు. కె.పెదపూడిలో 'నేను బడికి పోతాం'లో భాగంగా బడిబయట ఉన్న విద్యార్థులను మంగళవారం కలసి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట పిల్లలు లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోను విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ పి.గోవిందరాజు పాల్గొన్నారు.